సాక్షి
బాపట్ల
సోమవారం । 21 । అక్టోబర్ । 2024



ఆలయ అభివృద్ధికి విరాళం

తాడేపల్లిరూరల్: కంతంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానం అభివృద్ధికి విజయవాడకు చెందిన నీలిమ రూ.1,01,116 ఆదివారం అందజేశారు.



పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు 2.39 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం 43.54 టీఎంసీలు నిల్వ ఉంది. పూర్తి సామర్థ్యం 45.77 టీఎంసీలు.

పానకం బిందె రూ.1.50



మంగళగిరి:పట్టణంలోని పానకాల లక్ష్మీనృసింహ స్వామి వారి పానకం రూ.1.50కు తగ్గించబడిందని ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్షయపాత్ర ఫౌండేషన్ సహకారంతో పానకం ధర తగ్గించామని. భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షునిగా మేరుగ ప్రమాణం



బాపట్ల: బాపట్ల జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షునిగా డాక్టరు మేరుగ నాగార్జున సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. స్థానిక ఎమ్మెస్సార్ కళ్యాణ మండపం దీనికి వేదిక కానుంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి కోరారు.

అయిదు ఇసుక రీచ్‌ల నిర్వాహకుల ఖరారు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గంలో అచ్చంపేట, అమరావతి మండలాలలో 5 ఇసుక రీచ్‌ల నిర్వాహకులను ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేశారు. అచ్చంపేట మండలంలో అంబడిపూడి-1, అమరావతి మండలంలోని పొందుగుల రీచ్‌లను మెస్సర్స్ గోదావరి కృష్ణా వాటర్ వర్క్స్ అండ్ ట్రాన్స్‌పోర్టు కంపెనీకి రూ.54.99కు బిడ్ ఖరారు చేశారు. మెస్సర్స్ సాయి క్యూ అండ్ ఎస్ సొల్యూషన్స్ వారికి అంబడిపూడి-2 రీచ్‌ను రూ.89లకు, అంబడిపూడి-3 రీచ్‌ను రూ.99లకు, కోనూరు-1 రీచ్‌ను రూ.109లకు ఖరారు చేశారు. అమరావతి మండలంలోని మెస్సర్స్ సాయి క్యూ అండ్ ఎస్ సొల్యూషన్స్ వేసిన ఫైనాన్షియల్ బిడ్ ఆఫర్డ్ ధర రూ.125లు డీఎల్ఎస్ ఫిక్స్ చేసిన బేస్ ప్రైస్ కంటే ఎక్కువ ఉండటం వల్ల రీ-టెండర్ ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇసుక రీచ్‌లను దక్కించుకునేందుకు టీడీపీ వారే మరెవరికీ అవకాశం ఇవ్వకుండా 34 టెండర్లు వేసినట్లు సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన ధరలో సగం ధరలకే బిడ్‌లను తమ పలుకుబడితో దక్కించుకోవడం వెనుక భారీ అక్రమాలకు పాల్పడి ఉండవచ్చునని సందేహాలు వెలువడుతున్నాయి.

విఘ్నేశ్వరునికి ఘనంగా పూజలు



అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో ఆదివారం సంకటహర చతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జాగర్లపూడి శేషసాయిశర్మ ఈ సందర్భంగా స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలతో, గరికెతో విశేషాలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. అనంతరం నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి

నరసరావుపేట రూరల్: పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన మండలంలోని పమిడిమర్రులో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గాలం సీతారామయ్య(55) తనకు చెందిన జీవాలను మేత కోసం పంటపొలాల వైపు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమయింది. ఆ సమయంలో సీతారామయ్యకు సమీపంలో పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోని కొందరు రైతులు కూడా ఈ కారణంగా అస్వస్థతకు గురయ్యారు. సీతారామయ్యకు ముగ్గురు సంతానం ఉన్నారు. రూరల్ ఎస్ఐ కిషోర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నరసింహుని ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



బెల్లంకొండ: మండలంలోని కేతవరంలో గల శ్రీ వజ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి ఆదివారం భక్తుడు రూ.లక్ష విరాళాన్ని అందజేసినట్లు దేవదాయ శాఖ ఈవో వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. దాచేపల్లి మండలం తంగెడ గ్రామానికి చెందిన పాశం అంజిరెడ్డి దంపతులు ఆలయానికి వెళ్లి రూ.1.11లక్షలను ఆలయ అర్చకులు ప్రసన్నకుమార్‌కు అందజేశారని పేర్కొన్నారు.

అధికారంలోకి రావడానికి ఎన్నికల వేళ కూటమి అడ్డగోలు హామీల వల విసిరింది. తీరా ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేయాల్సిన సమయానికి కుంటిసాకులతో సరిపెడుతోంది. గంగపుత్రుల కోసం అమలు కావాల్సిన మత్స్యకార భరోసాపై కూడా ఇదే తరహాలో కాలయాపన చేస్తోంది. కష్టాల్లో చిక్కుకున్న గంగపుత్రులకు సాయం అందించడం లేదు.



సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారులు (ఫైల్)

4 నెలలైనా నయా పైసా లేదు!

- మత్స్యకార భరోసా సాయంపై సర్కారు నిర్లక్ష్యం
- రీ సర్వే పేరిట లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం
- ఆర్థిక ఇబ్బందులతో గంగపుత్రులు సతమతం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా సహాయం

చీరాల:తీరంలో వరుసగా అల్పపీడనాలు, వాయుగుండాల కారణంగా మత్స్యకారులు వేట సక్రమంగా సాగడం లేదు. వేట నిషేధ కాలం ముగిసి నాలుగు నెలలు పూర్తయినా ప్రభుత్వానికి గంగపుత్రుల ఆవేదన మచ్చుకైనా పట్టడం లేదు. భరోసా పథకం కూడా పక్కన పెట్టేసింది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో మత్స్యకారులకు వేట నిషేధం ఉంటుంది. వాస్తవానికి వీరికి వేట తప్ప మరో పని తెలియదు. నిషేధ సమయంలో వారి కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం కొంత సాయాన్ని భృతిగా అందజేస్తుంది. కానీ ఈ ఏడాది భృతిపై నీలినీడలు కమ్ముకున్నాయి. గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో వేట నిషేధ సమయంలో ఐదేళ్లపాటు క్రమం తప్పకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఏడాదికి రూ. 10 వేల చొప్పున చెల్లించారు. దీంతో మత్స్యకారులు అవస్థలు పడకుండా వేట నిషేధ సమయాన్ని పూర్తి చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికీ భృతి మంజూరుపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా సాయం రూ.10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచుతామంటూ హామీ ఇచ్చింది. ఈ హామీని నిషేధం పూర్తైన నాలుగు నెలలకూ అమలు చేయలేదు.

కాలయాపనకే ప్రాధాన్యం

జిల్లాలోని చీరాల, పర్చూరు, బాపట్ల, రేపల్లె, అద్దంకి, వేమూరు నియోజకవర్గాల్లో మత్స్యశాఖ అధికారులు సర్వే చేపట్టారు. ఆ సమాచారం మేరకు ఈ ఏడాది 12,350 మంది లబ్ధిదారులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి రూ.20 వేల చొప్పున మొత్తం దాదాపు రూ. 25 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో చీరాల, వేటపాలెం, బాపట్ల, రేపల్లె, బీవీ పాలెం తదితర ఏడు మండలాల్లో 76 కిలో మీటర్ల మేర తీరం ఉంది. వేట నిషేధ సమయంలో గంగపుత్రులు ఇంటి వద్ద ఉంటూ వలలకు మరమ్మతులు చేసుకుంటుంటారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ రీ సర్వే అంటూ మెలిక పెట్టింది. గతంలో టీడీపీ ప్రభుత్వం వేట నిషేధ సమయంలో రూ. 4 వేల పరిహారం ఇస్తే.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చాక దానిని రూ. 10 వేలకు పెంచి అందజేసింది. కూటమి ప్రభుత్వం రీ సర్వే పేరుతో లబ్ధిదారుల సంఖ్య తగ్గించే పనిలో ఉందని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

త్వరగా సాయం అందించాలి



తాము అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా వేట నిషేధం ముగిసి నెలలు గడుస్తున్నా మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేదు. గత ప్రభుత్వ హయాంలో ఠంఛనుగా రూ.10 వేలు మా బ్యాంకు ఖాతాకు జమ అయ్యేవి. ప్రస్తుతం సర్వే పేరుతో కాలయాపన చేస్తున్నారు. మా బాధలు అర్థం చేసుకుని త్వరగా సాయం అందించాలి.

– అంజయ్య, మత్స్యకారుడు

ప్రభుత్వం నుంచి సమాచారం లేదు

మత్స్యకారులకు వేట నిషేధ సాయం అందించే భరోసా పథకానికి సంబంధించి అర్హులను జిల్లాలో గుర్తించాం. ఆరు నియోజకవర్గాల్లో గంగపుత్రులకు చెల్లించాల్సిన సాయం వివరాలను ఉన్నతాధికారులకు అందించాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ఎప్పుడు సాయం అందిస్తారో కూడా తెలియదు.

–డాక్టర్ పి.సురేష్, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ, బాపట్ల

అమరుల త్యాగం.. స్మరణీయం

- విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులు
- సమాజ శ్రేయస్సే ధ్యేయంగా అడుగులు
- నేడు పోలీసు అమరవీరుల దినోత్సవం



సంస్మరణ దినోత్సవానికి సిద్ధం చేసిన అమర వీరుల స్థూపం

బాపట్ల టౌన్: దేశ సరిహద్దులో పహారా కాస్తూ ప్రాణ త్యాగం చేసిన సైనికులు... దేశంలో అంతర్గత భద్రతకు అహోరాత్రులు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీసులు.. ఎన్నటికీ స్మరణీయులే. అంతర్గత శత్రువులు.. సంఘ విద్రోహ శక్తులు... టెర్రరిస్టులు.. ఇలా సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే శక్తుల నుంచి ప్రజలకు రక్షణ కల్పించడం కత్తి మీద సాము లాంటిదే. సోమవారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి సేవలను స్మరించుకోవాల్సిందే.

ఇలా మొదలైంది..

1959 అక్టోబర్ 21న భారత్ – చైనా సరిహద్దులో చైనా ఆకస్మికంగా దాడికి తెగబడింది. దాడిలో సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 10 మంది వీరమరణం పొందారు. వారు తమ ప్రాణాలను లెక్కచేయకుండా దేశ భద్రత కోసం పోరు సాగించారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ 1960 అక్టోబర్ 21 నుంచి పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు

పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద సోమవారం జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విధినిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద పరేడ్ నిర్వహిస్తారు. మావోయిస్టులు, ఉగ్రవాదులు, తదితర అసాంఘిక శక్తులతో పోరాటమే గాక విధి నిర్వహణలో భాగంగా అల్లర్లు, అలజడుల్లో, కరోనా నియంత్రణలో కీలక విధులు నిర్వర్తించి ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తారు. స్మృతి పరేడ్ నిర్వహించి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు. జిల్లాలోని అన్ని సబ్‌డివిజన్ పరిధిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. 22న పోలీసు అధికారులు, సిబ్బంది ఆయా పరిధిలోని అమరుల గ్రామాలు/పట్టణాలు సందర్శించనున్నారు. వారు చదివిన పాఠశాలు/కళాశాలకు వెళ్లి అమరుల ఫొటోలు పెట్టి నివాళులు అర్పిస్తారు. అమరవీరుల గ్రామంలో ఏదైనా పాఠశాల లేదా రోడ్డు, తదితర అభివృద్ధి పనులకు అమరుల పేర్లు పెట్టేలా గ్రామస్తులకు సూచనలివ్వడం... పోలీసు అమరుల చేసిన గొప్ప పనుల వివరించి వారి ఫొటోలకు నివాళులు అర్పించేలా చూడటం వంటి చేపట్టనున్నారు. పాఠశాలలు / కళాశాలల్లోని విద్యార్థులకు, పోలీస్ పిల్లలకు చర్చావేదికలు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తారు. 24న పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు, యువతకు సైబర్ మోసాల బారిన పడకుండా ఉండాలంటే ఏం చేయాలి, సైబర్ మోసాలతో నష్టాలు, పర్యావరణాన్ని పరిరక్షించడంలో పోలీసుల పాత్ర అనే అంశాలపై వక్తృత్వ, వ్యాసరచన పోటీలు ఉంటాయి.

ఓపెన్ హౌస్‌కు చర్యలు

26, 27 తేదీల్లో జిల్లా పోలీసుల ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ ప్రదర్శన ఉంటుంది. విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తారు. సబ్ డివిజన్/సర్కిల్ కార్యాలయాలు, పోలీసు స్టేషన్‌ల స్థాయిలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 28న బాపట్ల పట్టణంలోని కళ్యాణమండపంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరం ఉంటాయి. 29న జిల్లాలోని డీఎస్పీలు, సీఐలకు పోలీసుల త్యాగాలపై ప్రముఖ వ్యక్తుల ద్వారా ఆన్‌లైన్‌లో సెమినార్ / ఉపన్యాసాలను నిర్వహిస్తారు. 30న డీఎస్పీ, ఏఎస్పీ (ఏఆర్) పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక విజయాలు సాధించిన వారికి సన్మానం చేయడం, వారి సేవలను ప్రశంసించనున్నారు. బ్యాండ్ షోలు, పోలీసు వాయిద్య బృందాల ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే పాటలు ఆలపిస్తారు. 31న న్యూస్ పేపర్లు, ప్రింట్ – ఎలక్ట్రానిక్ మీడియాలో విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా "రాష్ట్రీయ ఏక్తా దివస్" నిర్వహించడంతో సంస్మరణ వారోత్సవాలు ముగుస్తాయి.





అమరవీరుల స్థూపం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు

నదీ తీరంలో ఇసుక చిచ్చు

- ట్రాక్టర్లతో తరలింపు వ్యవహారంపై రచ్చ
- జాతర్లను తలపిస్తున్న వాహనాల జోరు
- కూటమి పార్టీల నాయకుల ధనాశే కారణం
- తీర గ్రామాలలో అడ్డుకుంటున్న ప్రజలు
- చింతర్లంకలో రవాణా నిలిపివేత
- పోటాపోటీతో రగులుతున్న విద్వేషాలు



కొల్లూరు మండలం చింతర్లంక కృష్ణా నదిలో ఇసుక లోడ్ చేసుకుంటున్న ట్రాక్టర్లు

కొల్లూరు: ఇసుకపై ప్రభుత్వం చేసిన ప్రకటన పచ్చటి గ్రామాలలో విద్వేషాలను రగులుస్తోంది. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా సొంత అవసరాలకు ఇసుక తరలించుకోవచ్చని సర్కారు ప్రకటించింది. దీంతో నదిలో నుంచి ఇసుక తరలించేందుకు వస్తున్న ట్రాక్టర్లు జాతరను తలపిస్తున్నాయి. జనసైనికులు, టీడీపీ నాయకుల అనుయాయులు తమ సొంత ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అడ్డగోలుగా తరలించి జేబులు నింపుకోవడానికి పోటాపోటీగా చేస్తున్న ప్రయత్నాల కారణంగా గ్రామాలలో ఈ వ్యవహారం రచ్చ రచ్చగా తయారైంది.

అడ్డగోలుగా తవ్వకాలు

కొల్లూరు మండలంలోని పెసర్లంక, గాజుల్లంక, జువ్వలపాలెం ఈపూరులంక, చింతర్లంక గ్రామాలలోని కృష్ణా నది నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు గత మూడు రోజులుగా పట్టపగ్గాలు లేకుండాపోయింది. సొంత అవసరాలకు ఇసుకను తరలించుకోవచ్చన్న నిబంధనను గాలికి వదిలేశారు. తెనాలి, చెరుకుపల్లి, రేపల్లె, నగరం, వేమూరు, భట్టిప్రోలు, అమృతలూరు, చుండూరు ప్రాంతాలకు రోజుకు వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి గృహ నిర్మాణదారులకు విక్రయించడం నిత్యకృత్యంగా మారింది. మూడు రోజుల క్రితం వరకు ట్రాక్టర్ ఇసుక రూ. 8 వేల నుంచి రూ. 9 వేల వరకు విక్రయాలు జరిపిన కూటమి ప్రభుత్వంలోని జనసైనికులు, టీడీపీ నాయకుల అనుయాయులు, బీజేపీ నాయకులకు చెందిన వ్యక్తులు... ప్రస్తుతం రూ. 4 వేలకు విక్రయాలు చేపడుతున్నారు.

గ్రామాలలో నిరసన సెగలు

కృష్ణా నదిలో వందల కొద్దీ ట్రాక్టర్ల ద్వారా పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక రవాణా చేపట్టడం గ్రామాలలో విద్వేషాలు రగలడానికి కారణంగా మారుతోంది. శనివారం మండలంలోని పెసర్లంక కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలకు బయట ప్రాంతాలకు చెందిన ట్రాక్టర్లు నదిలోకి రావడంతో ఆ గ్రామానికి చెందిన వ్యక్తులు ఆంక్షలు విధించారు. బయట ట్రాక్టర్లు తమ గ్రామంలోని నదిలోంచి ఇసుక తరలించిన పక్షంలో రూ. 500 ఆలయ హుండీలో వేయాలని తీర్మానించడం వివాదానికి కారణమైంది. రాస్తారోకో వరకు దారితీసింది. నదిలో ఇసుక తరలింపు విషయంలో పెసర్లంకలో వివాదం సర్దుమణగక ముందే నదికి నీరు రావడంతోపాటు, నదిలోకి ట్రాక్టర్లు దిగకుండా గ్రామస్తులు గండి ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం మండలంలోని చింతర్లంక శివాలయం వెనుక ప్రాంతంలో కృష్ణా నది నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు పెసర్లంక గ్రామానికి చెందిన ట్రాక్టర్లతోపాటు పలు ప్రాంతాలకు చెందినవి వెళ్లడంతో స్థానికులు తవ్వకాలను అడ్డుకున్నారు. విచ్చలవిడిగా ట్రాక్టర్లు నదిలోకి ప్రవేశించి ఇసుక తరలించుకొని వెళ్లడం వల్ల తమ గ్రామంలో రహదారులు దెబ్బతినడంతోపాటు, తాము నివసించడానికి సైతం ప్రశాంతత కరవైందని ప్రజలు వాపోతున్నారు. ట్రాక్టర్లతో ఇసుక తవ్వకాలు నిలుపుదల చేయించారు. నదిలోకి వెళ్లిన ట్రాక్టర్లు మినహా కొత్తగా వచ్చేవాటిని అనుమతించేది లేదని తీర్మానించారు. నది వద్ద ట్రాక్టర్లు దిగకుండా గండి కొట్టించేందుకు పూనుకున్నారు. నదీ తీరంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపు వ్యవహారం చివరకు గ్రామాల నడుమ విద్వేషాలు చోటుచేసుకోవడానికి దారితీసేలా ఉన్నాయన్న భావన లంక గ్రామాల వాసుల్లో వ్యక్తమవుతోంది

నిబంధనల అమలు శూన్యం

కూటమి ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక విధానంలో నిబంధనల అమలు కానరావడం లేదన్న భావన ప్రజల్లో వెల్లడవుతోంది. జిల్లాలో ఇసుక అవసరాలు తీర్చేందుకు మండలంలోని గాజుల్లంక, జువ్వలపాలెం ఇసుక క్వారీలను ప్రభుత్వ యంత్రాంగం గుర్తించింది. వీటికి తోడు భట్టిప్రోలు మండలం ఓలేరు, కొల్లూరు మండలం అరవింద వారధి ఎగువ ప్రాంతంలో మరో రెండు రీచ్‌ల నిర్వహణకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ఇసుక రీచ్‌లు ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సొంత అవసరాలకు ఎడ్లబండ్లతోపాటు ట్రాక్టర్ల ద్వారా కూడా ఇసుక తరలించుకోవచ్చునని ఇచ్చిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణకు నోచుకోవడం లేదు. సొంత అవసరాలకు తరలించుకోవడం అనే మాటను అడ్డుపెట్టుకొని, ఇసుక అక్రమంగా తరలించి విక్రయించడం కోసం కృష్ణా నదిలో చీమల దండులను తలపించేలా ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇసుక రవాణా చేపడుతుండటంతో ప్రశాంతతకు నిలయమైన గ్రామాలలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

7 కేజీల గంజాయి పట్టివేత

నరసరావుపేట టౌన్: గంజాయి కేసులో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 7 కేజీల గంజాయితోపాటు 8 ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె. నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ ఖాదర్‌వలి, ఏనుగుల బజార్‌కు చెందిన షేక్ సుభాని, కుంకలగుంట గ్రామానికి చెందిన మేదరమెట్ల గణేష్ కుమార్, రజకవాడకు చెందిన చింతపల్లి సుభాని, గుంటూరు చుట్టగుంట ప్రాంతానికి చెందిన సాతినేని అశోక్ కుమార్‌లకు గంజాయి అలవాటు ఉందని, విక్రయం కూడా మొదలు పెట్టారన్నారు. ఈ క్రమంలో షేక్ సుభానికి చెందిన కారులో వైజాగ్ వెళ్లి గంజాయి తెచ్చి పట్టణంలో విక్రయించి డబ్బు సంపాదిస్తున్నారన్నారు. రెండు రోజుల క్రితం పట్టణానికి చెందిన షేక్ అష్రఫ్, షేక్ షరీఫ్, షేక్ చావపాటి ఉమర్ సాదిక్‌లు కారులో పెద్ద మొత్తంలో గంజాయి తీసుకొచ్చారన్నారు. దానిని పై ఐదుగురికి ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల పక్కన హిందూ శ్మశాన వాటిక వద్ద అప్పగించి వెళ్లిపోయారని తెలిపారు. గంజాయిని ఐదుగురు తీసుకెళ్తుండగా వన్‌టౌన్ సీఐ చరణ్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ షేక్ సమందర్ వలి, ఎస్ఐ వంశీకృష్ణ పట్టుకున్నారని చెప్పారు. నిందితుల నుంచి రూ.13.35 లక్షల విలువైన గంజాయి, వాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



కృష్ణా నదికి వరద

కొల్లూరు : ఎగువన కురుస్తున్న వర్షాల ప్రభావంతో కృష్ణా నదిలో వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. గత నాలుగు రోజులుగా నదిలోకి కొద్ది మొత్తంలో నీటిని వదులుతున్న అధికారులు ప్రవాహం అధికమవడంతో ఆదివారం విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి దిగువకు 1.18 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో మండలంలోని కృష్ణా నదిలోకి ఆ నీరు చేరి నది నిండుగా మారింది. నీటి విడుదల పరిమాణం పెరిగిన పక్షంలో పెసర్లంక అరవింద వారధి ఎగువన నక్కపాయ గండి ద్వారా వరద నీరు కొల్లూరు కరకట్ట దిగువన ఉన్న పల్లపు ప్రాంతాలలోకి ప్రవేశించే ముప్పు ఉంది.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



వేటపాలెం: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారు. స్థానిక బీసీ గురుకుల పాఠశాలకు చెందిన కే సాయిసుబ్రాంత్, ఏ రాకేష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సి. నారాయణస్వామి ఆదివారం తెలిపారు. అండర్-19, అండర్-14 విభాగాల్లో ఇద్దరు బాలురు రాష్ట్రస్థాయి పోటీలకు ఆడనున్నట్లు చెప్పారు. ఈనెల 21వ తేదీన సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని తెలిపారు. విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారన్నారు. విద్యార్థులను పీఈటీ కే మమత, ఉపాధ్యాయులు అభినందించారు.

యూజీసీ నెట్‌లో ఉత్తీర్ణుడైన అమర్‌చంద్ర

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత



తెనాలి: జాతీయస్థాయిలో యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) నిర్వహించిన 'నెట్' (నేషనల్ ఎలిజిబుల్ టెస్ట్)లో తెనాలికి చెందిన ఆళ్లమూడి అమర్ చంద్ర అర్హత సాధించారు. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఉన్న యూజీసీ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ ఏడాది జూన్‌లో నెట్ పరీక్షను నిర్వహించింది. రెండు రోజుల కిందట ఫలితాలను ప్రకటించారు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హులు. జాతీయస్థాయి యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ చేసేందుకు అర్హత లభిస్తుంది. ఈ పరీక్షల్లో 89.18 పర్సంటైల్‌తో ఉత్తీర్ణుడైన అమర్‌చంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, పీహెచ్‌డీకి అర్హత సాధించారు. అమర్‌చంద్ర 2013లో ప్రైవేట్ స్కూలులో చదివి టెన్త్‌లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణుడయ్యాడు. నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి బీటెక్ పూర్తిచేశారు. తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ సోషియాలజీ చేశారు. తెనాలికి చెందిన అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు కుమారుడు అమర్‌చంద్రను పలువురు అభినందించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

చినగంజాం: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండలంలోని పెదగంజాం పంచాయతీ కోడూరి వారిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామంలోని సునామీ కాలనీకి చెందిన పట్టపు కులస్తుడు చీకలకోటి నరసింహ (37) వేట ప్రధాన వృత్తిగా కొనసాగిస్తున్నాడు. అతనికి అప్పులు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల మరలా అప్పులు చేసి కొత్త వలలు కొన్నాడు. సముద్రంలో వేట చేసేందుకు వలలను తీరంలో ఉంచాడు. ఇటీవల అల్పపీడనం కారణంగా కురిసిన భారీ వర్షాలకు కొట్టుకొని పోయాయి. దాంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం నరసింహ భార్య ఇంటి బయట పనులు చేసుకుంటుండగా అతడు ఇంటి లోపల ఉండి తలుపు గడియ పెట్టుకున్నాడు. ఆమె ఇంటి తలుపు తట్టగా తీయక పోవడంతో పగులగొట్టి తెరచి చూడగా ఇంటిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని చనిపోయి కన్పించాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి కేసు నమోదు చేసుకున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎస్ రమేష్ తెలిపారు.

23న నర్సుల సంఘం జిల్లా ఎన్నికలు



నామినేషన్లు వేసిన కోటమ్మ, పద్మజ ప్యానల్(ఫైల్)



నామినేషన్లు వేసిన శైలజ, అరుణ ప్యానల్ (ఫైల్)

- గుంటూరు జీజీహెచ్‌లో పోటాపోటీగా ఎన్నికల ప్రచారం
- అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా ఆస్పత్రిలో ఎన్నికల వేడి
- తామే గెలుస్తామంటూ రెండు ప్యానల్స్ ధీమా

గుంటూరు మెడికల్: ఆరేళ్ల తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా ఎన్నికలు గుంటూరు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్నారు. నూతన జిల్లా కమిటీలో పదవుల కోసం నర్సింగ్ సిబ్బంది రెండు ప్యానల్స్‌గా పోటీ చేస్తున్నారు. ఒక్కో ప్యానల్‌లో తొమ్మిది మంది చొప్పున ఈనెల 16న రెండు ప్యానల్స్ నామినేషన్లు వేశాయి. ఎన్నికలు ఈనెల 23న గుంటూరు జీజీహెచ్‌లో జరగనున్నాయి. పోటీలో నిలబడిన నర్సింగ్ సిబ్బంది కొద్ది రోజులుగా జీజీహెచ్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఆస్పత్రులకు వెళ్లి తమకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఎన్నికలతో జీజీహెచ్‌లో వాతావరణం బాగా వేడెక్కింది.

సంఘంలో 485 మంది సభ్యులు

జిల్లా నర్సుల సంఘంలో 485 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది గుంటూరు జీజీహెచ్‌వారే. ఇక్కడ 80 మంది హెడ్‌నర్సులు, 185 మంది స్టాఫ్‌నర్సులు ఉన్నారు. దీంతో కీలకమైన పదవుల్లో పోటీ చేస్తున్న వారంతా గుంటూరు జీజీహెచ్‌కు చెందిన వారే. 2019లో నర్సుల రాష్ట్ర సంఘంలో విభేదాలు వచ్చి నేటి వరకు ఎన్నికలు జరగలేదు. దీంతో పాత కార్యవర్గమే ఇప్పటి వరకు కొనసాగింది. ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా చేయాలని కొంత మంది నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయం అధికారులు రెండు ప్యానల్స్ అభ్యర్థులను కూర్చోబెట్టి మాట్లాడినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. కీలక నేతలు ఇద్దరూ కూడా తమకు పదవులు కావాలని గట్టిగా నిలబడుతున్నారు. దీంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ ఇద్దరూ కూడా ఒకసారి కీలకమైన పదవుల్లో ఉండి కూడా నర్సుల సంఘం బలోపేతం కోసం గాని, సభ్యుల ప్రయోజనాల కోసం ఏ మాత్రం పని చేయలేదనే విమర్శ వారిపై ఉంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో నర్సింగ్ సిబ్బంది కేడర్‌ను ఆఫీసర్‌గా మార్చారు. ఏపీలో మాత్రం నేటికి కూడా స్టాఫ్‌నర్సు, హెడ్ నర్సుగానే కొనసాగుతున్నారు. ఎంతో కీలకమైన నర్సింగ్ ఆఫీసర్ కేడర్ తీసుకురావడంలో ప్రస్తుతం పోటీ చేస్తున్న రెండు ప్యానల్స్ ముఖ్యనేతలు గతంలో ఏమీ పట్టించుకోలేదనే విమర్శలు తీవ్రంగా ఉన్నాయి. తమ నిరసనలకు కూడా ఏమాత్రం మద్దతు ఇవ్వలేదని, అందువల్లే రెగ్యులర్ అవ్వకుండా కాలయాపన జరుగుతోందని కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది వాపోవుతున్నారు. సమస్యలు పరిష్కారం అవ్వాలంటే నూతనంగా పోటీలో ఉన్నవారిని నాయకులుగా ఎన్నుకోవాలని ఇతర సభ్యులు ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారు. ఎవరు గెలుస్తారో వారు తప్పనిసరిగా రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలతోపాటుగా కాంట్రాక్ట్ సిబ్బంది సమస్యలపై పోరాటం చేయాలని పలువురు నర్సింగ్ సిబ్బంది కోరుతున్నారు.

ఆ ఇద్దరి కోసమే ఎన్నికలు

నర్సుల సంఘం జిల్లా కమిటీలో గెలుపు కోసం గుంటూరు జీజీహెచ్‌లోని ప్రభుత్వ నర్సింగ్ స్కూల్‌లో ట్యూటర్‌గా పనిచేస్తున్న వెల్లంపల్లి పద్మజ తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈమె గతంలో సెక్రటరీగా పనిచేసి, మరలా అదే పదవికి పోటీ చేస్తున్నారు. సంఘంలో జిల్లా ప్రెసిడెంట్‌గా పనిచేసి, ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్న బెల్లంకొండ శైలజ మరలా గెలవడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. 2016 నుంచి 2019 వరకు ఒకే ప్యానల్‌లో ప్రెసిడెంట్, సెక్రటరీగా పనిచేసిన ఆ ఇద్దరి వ్యక్తుల వల్లే నేడు ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆస్పత్రిలో సిబ్బంది చర్చించుకుంటున్నారు.

డాక్టర్ మేరుగ ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరండి



డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: బాపట్లలో సోమవారం జరిగే వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకార మహోత్సవానికి రేపల్లె నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ కోరారు. గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. డాక్టర్ నాగార్జున సారథ్యంలో వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లాలో మరింత బలోపేతం అవుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

యువజన విధానం ద్వారానే యువతకు ఉపాధి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్‌బాబు
- రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్రకార్యదర్శి నక్కీ లెనిన్‌బాబు

బాపట్ల : దేశవ్యాప్తంగా యువత అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమగ్ర యువజన విధానం తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కీ లెనిన్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కౌన్సిల్ సమావేశం డి రాజారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. లెనిన్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు హామీ అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటుపరం చేస్తూ నిరుద్యోగ దేశంగా మారుస్తున్నారని విమర్శించారు. చదువుకున్న యువతకు ఉపాధి లేక వలస వెళుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యమైన శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి కోసం ప్రభుత్వ రుణాలు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేసి ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని, ఉద్యోగాలు, ఉపాధి కల్పించలేని పక్షంలో నిరుద్యోగ భృతి నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలని కోరారు. రాజధాని అమరావతి ప్రాంతాన్ని ఫ్రీ జోన్ చేయాలని అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేస్తుంటే రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వ స్పందించకపోవడం సిగ్గుచేటనే విమర్శించారు. నవంబర్ ఒకటో తేదీన అన్ని విద్యార్థి యోజన సంఘాల ఆధ్వర్యంలో విశాఖపట్నంలో రాష్ట్ర సదస్సు నిర్వహించి రాష్ట్రవ్యాప్త ఉద్యమం ప్రారంభిస్తామని, కడప ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించి ఉక్కు ఫ్యాక్టరీ ప్రారంభించాలని రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని స్వీకారం చెబుతామని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో నూతన పరిశ్రమ ఏర్పాటు చేసి యువత ఉపాధి కల్పించాలని కోరారు. కేంద్రీయ విద్యాసంస్థల ఏర్పాటు చేసి విద్యను అందుబాటులోకి తేవాలని, బాపట్లలో మెడికల్ కాలేజ్ ప్రారంభానికి నిధులు కేటాయించి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జేబీ శ్రీధర్, ఏఐటీయూసీ నాయకుడు మామిడి పతల అశోక్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు కొండల్ రెడ్డి, రాకేష్, మామిడిపత్తుల వెంకటేశ్వర్లు, ఫణి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా కన్వీనర్‌గా బిజిలిబాబు ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్‌గా మేకల బిజిలి బాబు, కో కన్వీనర్స్‌గా డి రాజారెడ్డి, తుమ్మల పూర్ణ చంద్రశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయులు ఒత్తిడిని అధిగమించాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలతో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా ఒత్తిడిని అధిగమించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. యూటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలకు ఆదివారం బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో బహుమతి ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరిగిందని, తద్వారా అనారోగ్యానికి, ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించిన ఘనత యూటీఎఫ్‌కే దక్కుతుందన్నారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ పసాద్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో కాకినాడలో 20 వేల మంది ఉపాధ్యాయులతో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలకు గుంటూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని అన్నా రు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ క్రీడల నిర్వహణలో సహాయ, సహకారాలు అందించిన వ్యాయామ ఉపాధ్యాయులకు, క్రీడా మైదానాలను ఇచ్చిన యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కోశాధికారి ఎండీ గయాసుద్దీలా, నాయకులు సీహెచ్ ఆదినారాయణ, యు.రాజశేఖర్‌రావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, టి.ఆంజనేయులు, ఏ.శ్రీనివాసరావు, కె. కేదార్‌నాథ్, ఎం.కోటిరెడ్డి, కె. ప్రేమ్‌కుమార్, కె.ప్రభుజీ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం



తెనాలిరూరల్: తెనాలి మండలం సంగంజాగర్లమూడి వద్ద కాల్వలో గల్లంతైన బీటెక్ విద్యార్థి మృతదేహం లభించింది. గుంటూరు మండలం లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతున్న రవీంద్ర(20) ఐదుగురు స్నేహితులతో కలిసి శనివారం ఉదయం సంగంజాగర్లమూడి వచ్చి కొమ్మమూరు కాల్వలో దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. రవీంద్ర మృతదేహాన్ని కాకుమాను మండలం కొల్లిమర్ల వద్ద ఆదివారం గుర్తించారు. రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్, సిబ్బంది అక్కడకు వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె . వీరయ్య



విజేతలకు బహుమతులు అందజేస్తున్న యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్

ఏఎన్‌యూ :క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె వీరయ్య అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్థాయి అంతర్ కళాశాలల పురుషుల బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగాయి. ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు క్రీడల ఆవశ్యకతను గుర్తించాలన్నారు. క్రీడారంగానికి యూనివర్సిటీ ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందన్నారు.. కార్యక్రమానికి యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డీన్ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ అధ్యక్షత వహించారు. పోటీలలో బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(మొదటి బహుమతి), ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(రెండో బహుమతి), బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల (మూడో బహుమతి) సాధించాయి. విజేతలకు ప్రిన్సిల్ ఆచార్య కె వీరయ్య బహుమతులు అందజేశారు.

ప్రారంభమైన చదరంగ పోటీలు



గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యం అవసరమని, చెస్ ద్వారా సృజనాత్మకతను మెరుగుదిద్దుకోవచ్చని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అన్నారు. ఆదివారం లాంలోని కళాశాలలో ఆనంద్ చెస్ వింగ్స్, కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు స్టేట్స్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు 232 మంది పాల్గొన్నారన్నారు. టోర్నమెంట్‌లో క్రీడాకారులకు ఏడు రౌండ్లుగా నిర్వహించడం జరిగిందన్నారు. టోర్నమెంట్‌కు ఆర్బిటర్‌గా ఆనంద్ చెస్ వింగ్స్ డైరెక్టర్ మామిడాల గోపీనాథ్ వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్ర చదరంగం అసోసియేషన్ అధ్యక్షుడు వి.సత్యనారాయణ, కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ క్రీడా పోటీలలో గెలుపు ఓటములు సహజమని ప్రతి క్రీడాకారుడు తమ క్రీడలో నైపుణ్యతను మెరుగుపరుచుకునే దిశగా కృషి చేయాలన్నారు. గెలుపు సహజమైనా ఓటమి మరో గెలుపునకు నాంది అని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, అధ్యాపకులు, కోఆర్డినేటర్‌లు తదితరులున్నారు.

షూటింగ్ బాల్‌లో ఐలవరం విద్యార్థుల సత్తా



భట్టిప్రోలు: ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ 43వ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్స్ అండ్ ఉమెన్స్ షూటింగ్ బాల్ స్టేట్ లెవెల్ చాంపియన్ షిప్ పోటీలలో భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని శ్రీ నేతాజీ ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో జరుగుతున్న ఈ పోటీల్లో బాపట్ల జిల్లా నుంచి 28 మంది పాల్గొన్నారు. అందులో ఏడుగురు ఐలవరం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికకావడం గమనార్హం. ఎంపికైన వారిలో పదో తరగతి విద్యార్థులు పి. అనిల్‌కుమార్, కె. రాజశేఖర్, బి. సీతామహాలక్ష్మి, ఎల్. రమ్య, హరిణి, ఎనిమిదో తరగతి విద్యార్థులు జి. సాయి సింధూజ, వి. రాధిక, ప్రియాంక ఉన్నారు. వీరంతా సోమవారం జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడనున్నారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డిని, హెచ్ఎం మాచర్ల మోహన్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

కాలువలో దూకి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

బాపట్లటౌన్: కాలువలో దూకి యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని నాగరాజు కాలువ సమీపంలో చోటుచేసుకుంది. పట్టణంలోని ఉప్పరపాలేనికి చెందిన జంపని పూర్ణ పట్టణంలోని వీజీఆర్ఎం కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తనకు చదువురావడం లేదనే మనస్తాపంలో ఆదివారం కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన మత్స్యకారులు వెంటనే విద్యార్థిని ఒడ్డుకు చేర్చారు. చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

బాపట్లటౌన్: రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని చాకలిపాలెం గేటు సమీపంలో చోటుచేసుకుంది. చాకలిపాలెం రైల్వేగేటు సమీపంలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మెడలో ఎర్రటి కండువా, షార్టు వేసుకొని ట్రాక్‌పై నడుస్తుండగా విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న వందేభారత్ రైలు ఢీ కొట్టింది. ఈ ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'తొలి పంట' కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న విష్ణుశంకర్‌రావు తదితరులు

బాపట్ల: సాహిత్యం సమాజ విలువలు పెంపొందించాలని వ్యవసాయ కళాశాల రిటైర్డు డీన్ డాక్టరు దర్శి విష్ణుశంకర్‌రావు పేర్కొన్నారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో రచయిత మాల్యాద్రిరావు రచించిన తొలి పంట కవిత సంపుటిని ఆదివారం ఆవిష్కరించారు. డాక్టరు దర్శి విష్ణుశంకర్‌రావు మాట్లాడుతూ కార్మిక,కర్షక కష్టజీవుల శ్రమను రచయిత మాల్యాద్రి తన తొలి పంట కవితా సంపుటిలో అక్షరబద్ధం చేశారని తెలిపారు. ప్రతి హృదయంలో సాహిత్యం వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. సభకు వర్ధమాన రచయిత, సాహితీ భారతి సభ్యులు వెంకు సనాతన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సాహితీ భారతీ అధ్యక్షులు రావూరి నరసింహవర్మ, ఆదాం షఫీ,కట్ట వినయ్‌కుమార్, మన్నే శ్రీనివాసరావు, డాక్టర్ పి.సి.సాయిబాబు, కె. శ్రీ హరిరావు, జి.వి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యం



ప్రో-బోనో క్లబ్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, విజ్ఞాన్ చైర్మన్ లావు రత్తయ్య, వీసీ పి నాగభూషణ్ తదితరులు

- హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి
- విజ్ఞాన్‌లో ఘనంగా ప్రో-బోనో క్లబ్ ప్రారంభం

చేబ్రోలు: ప్రో-బోనో క్లబ్ పథకం ద్వారా న్యాయ సేవలను అందించడంలో ఉన్న అంతరాలను తగ్గించి, ప్రజలకు చట్టపరమైన సహాయం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం, న్యాయవర్గాలు కలసి పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్‌లో న్యాయ బంధు పథకం కింద 'ప్రో-బోనో క్లబ్'ను విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆదివారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి మాట్లాడుతూ ఈ క్లబ్ ప్రారంభం ద్వారా న్యాయ విద్యనభ్యసించే విద్యార్థులు సామాన్య ప్రజలకు, ముఖ్యంగా పేదలకు చట్టపరమైన సహాయం ఉచితంగా అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. న్యాయవాదులు తమ సామర్థ్యాన్ని, సేవలను స్వచ్ఛందంగా అందించడం ద్వారా సామాజిక న్యాయం అందరికీ సమానంగా చేర్చే ప్రయత్నం చేయాలన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు ఈ పథకం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. న్యాయ సేవలు అందుబాటులోకి రావడం ద్వారా వారి హక్కులు, సమస్యలను పరిష్కరించుకోవడంలో ఇది ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుందన్నారు. ప్రో-బోనో క్లబ్ అనేది స్వచ్ఛందంగా సేవలందించే న్యాయవాదులను సమీకరించే వేదికని, ఇక్కడ వారు సివిల్, క్రిమినల్ కేసుల్లో కూడా సహాయం అందిస్తారన్నారు. న్యాయ సేవలు అందరికీ అందడం చాలా అవసరమని, ఈ క్లబ్ ద్వారా న్యాయ సేవలు ప్రజల వరకు చేరతాయన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు నేరుగా న్యాయవాదులను సంప్రదించడం లేదా ప్రభుత్వ న్యాయ వేదికల ద్వారా కూడా కనెక్ట్ అవ్వవచ్చునన్నారు. న్యాయవాదులు కూడా స్వచ్ఛందంగా తమ సమయాన్ని వెచ్చించి, సామాజిక న్యాయంలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ కొన్ని దేశాలలో ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ జడ్జిల సహాయంతో వేల కేసులు పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులందరూ న్యాయ విద్యతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి రంగాలలో కూడా పట్టు సాధించాలన్నారు. ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి మెంబర్ సెక్రటరీ ఎం.బబిత, గుంటూరులోని 4వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఆర్.శరత్‌బాబు, హెచ్.అమర లింగేశ్వరరావు, పి.లీలావతి, విజ్ఞాన్ వీసీ పీ.నాగభూషణ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించడంలో ప్రభుత్వం విఫలం

అంబేడ్కర్ విగ్రహం వద్ద వరద బాధితుల నిరసన



లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

నెహ్రూనగర్: వరద బాధితులకు సాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె. జయసుధ విమర్శించారు. ఆదివారం లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద వరద బాధితులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 31న కురిసిన భారీ వర్షానికి నగరంలోని బొంగరాలబీడు, శాంతినగర్, నల్లచెరువు, వసంతరాయపురం, కాకుమానువారితోట, వెంకటప్పయ్యకాలనీ, ఆనందపేట, శారదా కాలనీతో పాటు పలు లోతట్టు కాలనీలు నీట మునిగాయని తెలిపారు. ఇళ్లల్లోని వస్తువులన్నీ పూర్తిగా పాడైపోయాయని చెప్పారు. ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం కొంత మందికి ఇచ్చి..మరి కొంత మందికి ఇవ్వకుండా వదిలేసిందని విమర్శించారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి బాధితుల వివరాలు సేకరించకుండా రోడ్డు మీద ఒకరు, ఇద్దరి పేర్లు నమోదు చేసుకుని వెళ్లారని ఆమె ఆరోపించారు. వారికి మాత్రమే రూ.10వేలు చొప్పున జమ చేశారని, మిగిలిన వారి పేర్లు రాసుకోకపోవడంతో వారికి ఆర్థిక సాయం అందలేదని వివరించారు. మిగిలిన బాధితులకు కూడా సాయం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. వివిధ సంఘాల నాయకులు పాగళ్ల ప్రకాష్, సీహెచ్ వాసు, రమణయ్య, డెన్నీస్ రాయ్, సాంబశివరావు, మాల్యాద్రి, లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.